పచ్చని గోడ! అడివిలో క్రూరజంతువుల మాట తలుపుకి రాగా అతనికి ఒళ్లు గగిర్పొడించింది.

"కంటితో చూస్తే భయం కాని లేకపోతే నాకేం భయం'' అని చేతిలో గొడుగు విప్పాడు. మొహానికి అడ్డుగా పెట్టుకున్నాడు. నడక ఎలాగు సాగుతుంది? మరొక ఉపాధ్యాయుడి చెయ్యి పట్టుకొని నడుస్తున్నాడు.

మొదటి ఉపాధ్యాయుడు "గొడుగు ఎందుకండీ విప్పారు పంతులు గారూ!'' అన్నాడు.

"ఇది మిమ్మల్ని కాపాడుతుంది. దీని మహత్యం అది'' అన్నాడు సింహాద్రిరావు.

"ఎలాగండి?'' అని రెండో మాష్టరు ప్రశ్నించాడు.

"ఏదేనా పెద్దపులికనక దీనిని చూసిందంటే, ఇదితనని మింగెయ్యడానికి వచ్చిన మృగసార్వభౌముడని తలచి తోక ముడిచేస్తుంది''అన్నాడు అతను.

"ఇది గొప్ప ఆలోచనే!'' అని కళ్ళెగరేశాడు మెచ్చుకొన్నట్లుగా, మరో ఉపాధ్యాయుడు.

అందరూ నవ్వేశారు.

"నాకు పెద్దపులంటే భయమనుకొన్నారా? అబ్బే! నసేమిరా! ఎందుకంటారా! వినండి చెప్తాను. నేను చిన్నప్పుడు దసరా పండుగలలో పెద్దపులివేషం వేసేవాణ్ణి. సరదా! అని సింహాద్రిరావు చేతిలో గొడుగు కింద పారవేసి. మేష్టర్లని నమ్మించడానికి కని "జజ్జనక జనక_జజ్జనక జనక_జజ్జనక జనక'' అని పులిఅడుగులు వేశాడు. "పెద్దపులి కనక నిజంగా ఎదురయిందంటే, నేను దానిలాగు అడుగులు వేసి, బుజాలాడించి, నేల మీద వాలి పంజా చూపించే సరికి 'ఇంకేం! మనవాడే!' అని దాని దారిన అది చక్కాపోతుంది!'' అన్నాడు.

ఈ పార్టు చూసి ఉపాధ్యాయులు పొట్టలు చెక్కలయేటట్లు నవ్వుతున్నారు.

